సాక్షి బాపట్ల

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



గ్రామదేవతలకు చద్ది సమర్పణ

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మ వార్లకు గురువారం చద్ది సమర్పించారు. భక్తులు పూజలు జరిపారు.



వెలుగు కార్యాలయంలో ఆడిట్

బొల్లాపల్లి : స్థానిక వెలుగు పథకం కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిధులకు సంబంధించి ఆడిట్ జరిగింది.



డీఎల్‌పీవో పర్యటన

నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాన్ని నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు గురువారం సందర్శించారు. ఖాళీ స్థలాలు, ఇళ్ల కొలతలు వేసి గుర్తింపు పత్రాలు అందిస్తామన్నారు.

న్యూస్‌రీల్

స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు పరిశీలన



బాపట్ల: బాపట్లలో భారత స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. భారీ వర్షాల కారణంతో ప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా జెండా పండుగను నిర్వహించాలన్నారు. బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం సంబంధిత కళాశాల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు వచ్చినప్పటికీ జాతీయ పండుగను వైభవంగా జరపాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాలు, స్టాల్స్ ప్రదర్శన నిర్వహించే ప్రాంతాలను ఆయన పరిశీలించారు. త్వరగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా ఉన్నారు.

ట్రయల్ రన్

బాపట్లటౌన్: గురువారం ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను వీక్షించడానికి విచ్చేసే ప్రజలకు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు వస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ జి.నారాయణ, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, ఆర్ఐలు షేక్ మౌలుద్దీన్, టి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా అమరేశ్వర స్వామి వార్ల పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు గురువారం ఉదయం అలయ అర్చకులు, వేద పండితులు మండప పూజ, దీక్ష హోమం, రుద్ర హోమం, పవిత్ర ధారణ, చండీ హోమం జరిపి హారతి మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం స్వామి వార్లకు పట్టు పవిత్రములు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ మాట్లాడుతూ విజయవాడకు చెందిన యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం పవిత్రోత్సవాలు ముగింపు సందర్భంగా 11 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.



ఆవులవారిపాలెం వద్ద పంట పొలాల్లోకి చొచ్చుకుపోతున్న వరద నీరు



చింతర్లంక వద్ద వరద నీటిలో మునిగిన మునగ తోట



గాజుల్లంక -పోతార్లంక గ్రామాల నడుమ కంద పంటలో ప్రవహిస్తున్న వరద నీరు



కొల్లూరు కరకట్ట దిగువున వరద నీటిలో మునిగిన ఇటుక బట్టీలు

లంక గ్రామాల ప్రజలను వరద భయం వెంటాడుతోంది. గురువారం ఉదయం ప్రకాశం బ్యారేజ్ నుంచి ఐదు లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో వరద నీరు గ్రామాల్లోకి చొచ్చుకువస్తుంది. పంట పొలాలు కోతకు గురవుతున్నాయి. పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మునగ, దొండ, బొప్పాయి పంటలు నీటిలో నానుతున్నాయి. ఇటుక బట్టీలు నీట మునిగాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వరద ఉధృతం

లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ప్రమాదం



తిప్పలకట్ట వద్ద వరద ఉధృతికి కోతకు గురైన పంట భూములు

- లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- అందుబాటులో బోట్లు, గజ ఈతగాళ్లు

భట్టిప్రోలు: ప్రకాశం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేస్తున్న వరద నీటి కారణంగా కృష్ణానదీ పరీవాహక లంక గ్రామాల్లో కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాల్లో సాగు చేసిన వాణిజ్య పంటలు నీట మునిగే ప్రమాదం ఉంది. దీంతో రైతులు అప్రమత్తమయ్యారు. పెదపులివర్రు-పెసర్లంక, ఓలేరు-పెసర్లంక, కోళ్లపాలెం-పెసర్లంక చప్టాల వద్ద నీరు చేరింది. దీంతో ఆయా మార్గాల్లో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. రేవు వద్ద వరద నీరు ఉదయం 15 అడుగుల మేర ప్రవహించగా సాయంత్రం మరింత పెరిగింది. లంక గ్రామాల వాసులు వెల్లటూరు చిన రేవు హైలెవల్ వంతెన మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రేవులోకి వెళ్ల వద్దని భట్టిప్రోలు మండల తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు లంక గ్రామాల ప్రజలకు సూచించారు. ఓలేరు పల్లెపాలెం, కాకులడొంక రేవు వద్ద పరిస్థితిని తహసీల్దార్‌తో పాటు వీఆర్వోలు పరిశీలించారు.



భట్టిప్రోలు మండలం పెదలంక కాకులడొంక వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

దిగువకు 5.65 లక్షల క్యూసెక్కులు విడుదల

ప్రకాశం బ్యారేజ్ నుంచి ఉదయం 5.65 లక్షల క్యూసెక్కుల విడుదల చేశారు. దిగువకు నీరు విడుదల కావడంతో నదీ పరీవాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండేలా రెవెన్యూ శాఖతో పాటు పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక దళం, ఆర్‌సీ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు బోట్లు, ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల రెవెన్యూ అధికారులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కోరారు. చాటింపు ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలు చప్టాలు, రేవులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వ్యవసాయ పనుల నిమిత్తం నదిలోకి వెళ్లకుండా పశువులు, గొర్రెలు, మేకలు తోలుకుని జాగ్రత్త పడాలని సూచించారు. భట్టిప్రోలు మండలంలో నదిని ఆనుకుని ఉన్న గ్రామాలైన ఓలేరు, పల్లెపాలెం, పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయా ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పరిస్థితిని వీఆర్వోలు రెవిన్యూ సిబ్బంది వివిధ శాఖల అధికారులు,సచివాలయ సిబ్బంది సమీక్షించారు.



పోతార్లంక సమీపంలో వరద ముంపులో అరటి పంట

కరకట్టల పటిష్టతకు చర్యలు

కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో మరమ్మతులు నిర్వహించి ఇసుక బస్తాలను ఇప్పటికే సిద్ధం చేశారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున రైతులు మోటార్లను ఊడదీసి సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. ఆర్‌సీ ఏఈ కె.నాగేశ్వర నాయక్ సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా కరకట్టకు గండ్లు పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి పటిష్టం చేయడమే కాక ఇసుక మూటలను సిద్ధం చేశారు. ప్రజలు అప్రమత్తంగా అధికారులకు సహకరించాలని కోరారు.

కొల్లూరు: కృష్ణా నదిలో వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాల ప్రజలను వరద భయం పట్టి పీడిస్తుంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు గురువారం 5 లక్షల 65 వేల 201 క్యూసెక్కులు విడుదల చేశారు. గాజుల్లంక చినరేవు నుంచి వచ్చిన వరద నీరు మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న లో లెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుండటంతో లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, కిష్కింధపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వీరు భట్టిప్రోలు మండలం వెల్లటూరు, కొల్లూరు మండలం గాజుల్లంక మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణం సాగిస్తున్నారు. అరవింద వారధి సమీపంలోని నక్కపాయ గండి, ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంక సమీపంలోని గండి, గాజుల్లంక గ్రామం వెంబడి నది గట్టుకు గండ్లు ఏర్పడ్డాయి. వరద నీరు ఇటుకరాయి మట్టి కోసం తవ్విన గుంతల్లోకి చొచ్చుకొని రావడంతో ఆ మూడు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. మండలంలోని చింతర్లంకలో నది అంచున ఉన్న లోతట్టు పంట భూముల్లోకి వరద నీరు చేరడంతో అరటి, కంద, పసుపు, కూరగాయల పంటలు ముంపు బారిన పడ్డాయి. పోతార్లంక -గాజుల్లంక గ్రామాల నడుమ కంద, అరటి, పసుపు, కూరగాయల పంటలను వరద ముంచెత్తింది. కొల్లూరు, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల పరిధిలో ఉన్న ఇటుక బట్టీలు నీట మునిగాయి.

రేపల్లెలో వరదపై సమీక్ష



పెనుమూడి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో లంక గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం ఆయన పెనుమూడి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం వరద ప్రభావిత గ్రామాలైన పెనుమూడి, పెనుమూడి పల్లిపాలెం, రావి అనంతవరంలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వరద ఉధృతి పెరిగితే ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలన్నారు. ముంపు ప్రాంతాలలో ముందస్తు చర్యలో భాగంగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టామన్నారు. గురువారం 12 గంటల సమయంలో ప్రకాశం బ్యారేజ్ నుంచి 5.52 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేసినట్లు తెలిపారు. రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఏదైనా సహాయం కోసం 77 94 89 45 44 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఆయన వెంట వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



చేపల వేటను నిలిపివేసి ఒడ్డున నిలిపి ఉంచిన బోట్లు

రైతుల్లో కలవరం

భట్టిప్రోలు: కృష్ణా నదిలో వరద ఉధృతి పెరుగుతుండడంతో లంక గ్రామాల రైతులు కలవరపడుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు గురువారం ఉదయం 3.97 లక్షలు, సాయంత్రం 5.65 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పెదపులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతులు పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. వరద ఉధృతికి పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పరిస్థితిని తహసీల్దార్ మేకా శ్రీవాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శాంతకుమారి, ఎంపీడీవో ఎస్‌వీ రమణ, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ ఆధ్వర్యంలో వీఆర్వోలు మంద్రు జక్రయ్య, ఎల్.సురేష్, రాంబాబు, పంచాయతీ సిబ్బంది, వీఆర్ఏలు సమీక్షిస్తున్నారు.

కారంచేడుకు కీర్తి..

స్వాతంత్రోద్యమంలో 18 మంది కారంచేడు యోధులు



దండి ఉప్పు సత్యాగ్రహంలో కారంచేడు యోధులు (ఫైల్)



శివాలయం గోడపై శిలాఫలకం

కారంచేడు: 78 ఏళ్ల కిందట మనకు వచ్చిన స్వాతంత్ర్యం వెనుక ఎంతో మంది శ్రమ, దీక్ష, పోరాటాలు, ప్రాణ త్యాగాలు ఉన్నాయి. అప్పటి మన స్వాతంత్ర్య పోరాటాల్లో కారంచేడుకు చెందిన 18మంది యోధులు పాల్గొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పిలుపుతో వీరంతా అప్పటి దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గ్రామంలో పాత శివాలయం వద్ద వీరు సమావేశమైనట్లు చరిత్ర చెబుతోంది. ఉప్పు సత్యాగ్రహంలో వీరందరూ జైలు జీవితం గడిపారు. అప్పట్లో ఒక సారి చీరాలకు వచ్చిన మహాత్మాగాంధీని కూడా కలిసి సత్యాగ్రహం గురించి చర్చించారు. వీరికి గ్రామానికి చెందిన యనమంద్ర వెంకటసుబ్బయ్య పంతులు, పోతిని వెంకటసుబ్బయ్య పంతులు, కారంచేటి మల్లయ్య పంతులు నాయకత్వం వహించినట్లు చరిత్ర చెబుతోంది. దండి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న వారిలో దగ్గుబాటి నాయుడమ్మ, యార్లగడ్డ వెంకన్నచౌదరి, పోతిన వెంకన్నచౌదరి, గోరంట్ల లింగయ్యచౌదరి, యార్లగడ్డ అంజయ్యచౌదరి, గొట్టిపాటి శ్రీరాములు, పోతిన వెంకయ్యచౌదరి, నాళం సుబ్బారావుగుప్తా, యార్లగడ్డ చినలక్ష్మయ్య, యార్లగడ్డ మునసుబుగారి సుబ్బరాయుడు, మండవ మల్లయ్య, దగ్గుబాటి సుబ్బన్నచౌదరి, జాగర్లమూడి వెంకటకృష్ణయ్య చౌదరి, తవ్వా వెంకటసుబ్బయ్య గుప్తా, జాగర్లమూడి వెంకటకృష్ణయ్య చౌదరిలు పాల్గొన్నట్లు చరిత్ర చెబుతుంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేటపాలెం విద్యార్థినులు


వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వేటపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దేవరకొండ సరోజని గురువారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల, బాలికల వాలీబాల్ సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన కే గాయత్రి, పీ బిందు ప్రతిభ కనబరిచి బాలికల జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 18వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు జడ దేవభిక్షం, జరుబుల శ్రావణి, ఉపాధ్యాయులు అభినందించారు.

బైకు దొంగలు అరెస్టు

రెండు స్కూటీలు, ఒక మోటార్ బైక్ స్వాధీనం



అద్దంకి రూరల్: బైకులు, స్కూటీలు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకుల ఆటను పోలీసులు కట్టించారు. గురువారం అద్దంకి సీఐ సుబ్బరాజు నిందితుల వివరాలను వెల్లడించారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి కుంచాల ఏసు కుమార్, పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఉప్పల శివయ్యలు కలసి అద్దంకిలోని రెండు స్కూటీలు, ఒక బైకును దొంగిలించారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు అద్దంకి ఎస్సై పీవీ నరసింహులు, సిబ్బంది గురువారం స్థానిక శింగరకొండ రోడ్డులోని ద్వారకా నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులను పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని ఒక బైకు, రెండు స్కూటీలను స్వాధీనం చేసుకున్నారు.

నదిలో గల్లంతైన యువకుల కోసం గాలింపు

తాడికొండ: కృష్ణానది వరద ఉధృతికి తుళ్ళూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో బుధవారం గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వీరిలో ఓ యువకుడి మృతదేహం సాయంత్రానికి లభ్యమైంది. వెంకటపాలెం నేషనల్ హైవే వంతెన పరిసర ప్రాంతంలో రెస్క్యూ టీమ్ సభ్యులు ఒకరి మృతదేహాన్ని కనుకున్నారు. మృతదేహం ప్రసంగి వీర ఉపేంద్రగా గుర్తించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్‌కు తరలించారు. ఇసుక తోడే డ్రోజర్‌ను స్థానం మార్చేందుకు నదిలోకి దిగగా వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఇద్దరు గల్లంతయ్యారు. మృతుడి స్వగ్రామం తెనాలి వద్ద పెదపాలెం కాగా ప్రస్తుతం తాడేపల్లిలోని సీతానగరంలో నివాసం ఉంటున్నారు.

అంగన్‌వాడీ పోస్టు కోసం టీడీపీలో రగడ

మంత్రి ఫ్లెక్సీలు పీకేసి నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

అద్దంకి: అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య అంగన్‌వాడీ పోస్టు రగడకు తెరలేపింది. 40 ఏళ్ల నుంచి పార్టీలో ఉంటూ తాము సూచించిన వారికి రాకుండా, ఇటీవల టీడీపీలోకి వచ్చిన వారు సూచించిన వారికి ఇచ్చారు. దీంతో వారంతా మంత్రి ఫొటోతో ఉన్న ఫ్లెక్సీలను తీసేసి నిరసన వ్యక్తం చేశారు.

పార్టీలో కొనసాగడం కష్టం..

ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పరిటాల నాగరాజు, పరిటాల శ్రీనివాస రావు, పార్టీ సానుభూతిపరులైన మహిళలు మాట్లాడుతూ.. తాము 40 సంవత్సరాల నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీకి వచ్చిన వారికి అంగన్‌వాడీ పోస్టు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మాయపాలెంలో ఈ రోజుతో టీడీపీ కార్యకర్తలు లేనట్లేనని వాఖ్యానించారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము పార్టీలో కొనసాగడం కష్టమన్నారు. భవిష్యత్ నిర్ణయాన్ని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

క్వారీలో నిబంధనలు తప్పనిసరి


గ్రానైట్ నిర్వాహకులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

- బల్లికురవ, సంతమాగులూరు మండలాల గ్రానైట్ క్వారీ యజమానులతో సమావేశం
- బాధ్యతాయుతంగా పనిచేయించాలన్న ఆర్డీవో

బల్లికురవ: గ్రానైట్, క్వారీ యాజమాన్యాలు తమ వద్ద పనిచేసే కార్మికుల పూర్తి సమాచారంతో బాధ్యతాయుతంగా పనులు చేయించాలని.. అప్పుడే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక పరిషత్ కార్యాలయంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని క్వారీ యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ.. భద్రతా చర్యలు పాటించటంతోపాటు బ్లాస్టింగ్‌లు మ్యాగజైన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పేలుళ్ల సమయాల్లో సమీప పంట పొలాల్లోని రైతులకు, పరిసర క్వారీలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వచ్చి ఇక్కడ కార్మికులు పనిచేస్తుందున వారి పట్ల చులకన భావన వీడాలన్నారు.

అనుమతులు లేకపోతే చర్యలు..

పనులు చేసేటప్పుడు మేనేజర్, మేట్ అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాపట్ల డీఎస్పీ జీ. రామాంజనేయులు మాట్లాడుతూ క్వారీలను మైనింగ్, కార్మిక, రెవెన్యూశాఖల అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. క్వారీలో పేలుడు పదార్థాల నిల్వ, పనిచేస్తున్న కార్మికుల వివరాలు రికార్డులో నమోదు చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఘోర ప్రమాదాలు భవిష్యత్‌లో తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో బల్లికురవ, సంతమాగులూరు, తహసీల్దార్‌లు రవినాయక్, రవికుమార్, సీఐ వెంకట్రావు, ఎస్సై వై నాగరాజు, మైనింగ్ ఏడీ రామచంద్రా, విజిలెన్స్ ఏజీ సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారమే దారి దోపిడీ

మేడికొండూరు : మేడికొండూరు మండల పరిధిలో దారి దోపిడీ పక్కా పథకం ప్రకారమే జరిగిందని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 4న రూ.70 లక్షల నగదు, కారును అపహరించుకు వెళ్లినట్లు విజయవాడలో నివాసం ఉంటున్న జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మేడికొండూరు పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జగదీష్ స్నేహితుడు రంజిత్ ఈ నెల 4న బంగారపు మట్టి (లంకె బిందెలు లాంటివి) ఉందని జగదీష్‌ను నమ్మించి కేజీ రూ. 50 లక్షలు చొప్పున రెండు కేజీలు ఉందని చెప్పగా అందుకు జగదీష్ తన వద్ద రూ.70 లక్షలు మాత్రమే ఉన్నాయని, మిగతావి రెండు రోజుల తర్వాత ఇస్తానని చెప్పడంతో అందుకు రంజిత్ అంగీకరించాడు. జగదీష్ తన కారులో సత్తెనపల్లి వచ్చి అక్కడ ఉన్న రంజిత్ మరో ఇద్దరు వ్యక్తులతో మాట్లాడి బంగారపు మట్టిని పరిశీలించాడు. అనంతరం ఎవరి కారులో వాళ్ళు విజయవాడ బయలుదేరారు. మేడికొండూరు సమీపంలోకి రాగనే ఇద్దరు వ్యక్తులు జగదీష్ కారును అడ్డగించారు. పోలీస్ దుస్తులలో ఉన్న వారు విజిలెన్స్ అధికారులం అంటూ, జగదీష్ కారులో ఉన్నవి రూ.70 లక్షల నగదు, కారు తీసుకొని పరారయ్యారు. వెంటనే జగదీష్ తన స్నేహితులకు ఈ విషయం తెలిపి, సత్తెనపల్లి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 13వ తేదీన పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో సోరియాసిమ్ కంపెనీ వద్ద కార్లను తనిఖీ చేస్తుండగా ఈ కేసులో నిందితులైన అంకుష్, మహాదేవులు వారి వాహనంతో వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కారులో 40 లక్షల రూపాయల నగదు, ఆరు లక్షల రూపాయలు విలువ చేసే బంగారం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్నేహితుడిని నమ్మించి మోసగించిన ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజమండ్రికి చెందిన రంజిత్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ చూపిన మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్, ఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుల్ జాన్ సైదా, బాజీ సాహెబ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

20 లోపు అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోవాలి

కొరిటెపాడు(గుంటూరు): వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతుల కోసం అన్నదాత సుఖీభవ పోర్టల్ రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచినట్టు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాడ్యూల్ 20వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవకు అర్హులై ఉండి, లబ్ధి పొందని రైతులు ఈ నెల 20వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ గ్రీవెన్స్‌ను మాడ్యూల్‌లో పొందుపరచి తగిన పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు

తాడికొండ: రాజధాని నిర్మాణానికి మలి విడత భూ సమీకరణ అంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనలతో రాజధాని ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబు రావు అన్నారు. గురువారం సీపీఎం బృందం రాజధానిలో పర్యటించింది. తుళ్లూరులోని ఆర్‌వీఆర్ నిర్మాణ సంస్థకు చెందిన వలస కార్మికుల గృహ సముదాయం వద్ద కార్మికులతో మాట్లాడుతూ కార్మికులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలో పనులు లేకపోవడం పెద్ద సమస్యగా ఉందని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పనులు చేసుకుంటుంటే స్థానికులు ఇళ్ల దగ్గరే ఉండే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజధాని నిర్మాణానికి భూములు తీసుకునేటప్పుడు అందరికీ పనులు కల్పిస్తామని చెప్పిన హామీ అమలు కావడం లేదన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు పేరం బాబు రావు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, షేక్ జానీ, కాపారపు రామకృష్ణ, పి వెంకటేశ్వర్లు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీట్లు కేటాయింపు వెంటనే చేపట్టాలి: ఎస్ఎఫ్ఐ

లక్ష్మీపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించి 20 రోజులు గడిచినా నేటికీ విద్యార్థులకు సీట్లు కేటాయింపు చేయలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 22న కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ, నేటి వరకు విద్యార్థులకు ఏ కాలేజీలో సీట్లు పొందారో తెలియజేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, నగర కార్యదర్శి ఏ.యశ్వంత్, ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు ఎస్కే సుభాని పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ..

బైకును ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


మృతి చెందిన షేక్ జిలానీబాష

మేదరమెట్ల: మోటారు బైకును ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్ ఎదురు బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అద్దంకి మండలం వెంపరాల గ్రామానికి చెందిన షేక్ జిలానీబాషా (27) కొరిశపాడు మండలంలోని తమ్మవరం గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామం మోటారు వాహనంపై వెళుతున్నాడు. బైకు సెయింట్ ఆర్నాల్డ్స్ స్కూల్ ఎదురుగా రాగానే ఒంగోలు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు విజయవాడ నుంచి ఒంగోలుకు వెళుతోంది. బస్సు మోటారు బైకు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న జిలానీబాష రోడ్డుపై పడిపోగా తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కార్లు ఢీ - ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల: ఆగిఉన్న కారును వెనుక నుంచి వచ్చిన మరో కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన కొరిశపాడు మండల పరిధిలోని గ్లాసు ఫ్యాక్టరీ వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. పర్చూరు నుంచి ఒంగోలు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న మరో కారును బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదం గ్లాసు ఫ్యాక్టరీ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. దీంతో ఢీకొట్టిన కారులో ముగ్గురికి గాయాలయ్యాయి. కారు ముందుభాగం దెబ్బతింది. గాయపడిన వారిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లంక వాసులు.. అప్రమత్తంగా ఉండండి !

- గ్రామాలో ప్రజలకు అధికారుల అవగాహన
- వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు పునరావాస కేంద్రాలకు రావాలి


అన్నవరపు లంకలో ప్రజలకు వరద ఉధృతి గురించి వివరిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావు

కొల్లిపర: రాష్ట్రంలో పలుచోట్ల కురుస్తున్న భారీ వర్షాలకు సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి 6లక్షల క్యూసెక్కుల వరద నీటిని బుధవారం వదిలారు. ఈ నేపథ్యంలో మండలంలోని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎస్ఐ పి. కోటేశ్వరరావు సూచించారు. ఇద్దరు గురువారం కృష్ణా నది రేవులను పరిశీలించారు. అనంతరం లంక గ్రామాల ప్రజలతో వరద ఉధృతిపై మాట్లాడారు. నదిలోకి వరద నీరు చేరడంతో లంక గ్రామాల ప్రజలు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రిపూట తప్పని పరిస్థితిలోనే పడవ నడపాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు నది వైపు రాకుండా గ్రామ పెద్దలు, సర్పంచులు, వీఆర్వోలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 7లక్షల క్యూసెక్కుల వరకు వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల్లోని వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస కేంద్రాలకు తరలి రావాలని తెలిపారు. పాడి పశువులను ఇతర గ్రామాల్లోని బంధువుల ఇంటికి ముందుగానే తరలించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్వోలతో మాట్లాడారు. లంక గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని ఆదేశించారు. తూములూరు, హనుమాన్‌పాలెం, కొల్లిపర పాఠశాలల్లోని పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో రామారావు, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


లంక గ్రామాల నుంచి అరటి గెలలను పడవ ద్వారా ఒడ్డుకు తరలిస్తున్న రైతులు


లంక గ్రామాల నుంచి పశువులను తరలిస్తున్న రైతులు

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 65.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 9.2 మి.మీ వర్షం పడింది. సగటున 27.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మేడికొండూరు మండలంలో 52.6 మి.మీ., తుళ్ళూరు 42.4, తాడేపల్లి 36.8, దుగ్గిరాల 32.6, ప్రత్తిపాడు 31, చేబ్రోలు 26.6, తాడికొండ 26, మంగళగిరి 23.8, గుంటూరు పశ్చిమ 22, గుంటూరు తూర్పు 20.2, పెదనందిపాడు 18.6, వట్టిచెరుకూరు 18.6, కొల్లిపర 18.2, కాకుమాను 17.2, తెనాలి 16.2, పెదకాకాని మండలంలో 14.4 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 14వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 74.4 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 199.5 మి.మీ వర్షపాతం పడింది.

తటాకం కాదు మైదానం!



ఈ చిత్రం చూసి, ప్రభుత్వ పాఠశాలలో ఎంత మంచి స్విమ్మింగ్ పూల్ ఉంది.. అనుకుంటే బురదలో కాలేసినట్లే.. వారు అలా ఈత కొడుతుంది ఎటూపోయే మార్గంలేక నిలిచిపోయిన వర్షం నీటిలో.. బెల్లంకొండ జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండు రోజులుగా భారీవర్షాలు కురవడంతో వర్షపు నీరు పాఠశాల మైదానంలో నిలిచిపోయింది. మోకాళ్ల లోతు నీళ్లు ఉండడంతో చిన్నారులు గురువారం ఇలా ఈత కొడుతూ కనిపించారు. వర్షం పడిన ప్రతిసారి పాఠశాలలో ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు చెబుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు రోజుల తరబడి నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. - బెల్లంకొండ

వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ వింగ్‌లో పల్నాడు యువత

సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కమిటీలో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరు యువ నేతలకు చోటు లభించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా నరసరావుపేటకు చెందిన షేక్ నాగూర్ వలి, జాయింట్ సెక్రటరీగా గురజాలకు చెందిన షేక్ అల్లాభక్షులకు చోటు కల్పించారు. ఈమేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది.

జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట రూరల్: జిల్లాలో భూగర్భ జల నీటి మట్టం గతేడాది కన్నా 2.26 మీటర్లు పెరిగిందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. నీటి వనరులపై సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సాగునీటి సంఘం సభ్యులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలం 30 మీటర్లు అడుగున ఉండే బొల్లాపల్లి మండలం, వెల్దుర్తి మండలాల్లో సైతం వరుసగా ఆరు మీటర్లు, మూడు మీటర్లు పెరిగిందని తెలిపారు. జిల్లాలో పెద్దఎత్తున ఫారం పాండ్లు నిర్మాణాల వలన వచ్చే ఏడాదికి భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉందని వివరించారు. సమగ్ర నీటి నిర్వహణలతో సాగు నీటి సంఘ సభ్యులను, రైతులను భాగస్వాములను చేస్తామని తెలిపారు. పదిహేను రోజుల్లో అన్ని ప్రాజెక్టులకు మరమ్మతులు, కాల్వలో పూడిక తీత పనులు పూర్తికావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలమట్టం 20 మీటర్లు, 10 మీటర్లు దిగువున ప్రాంతాల్లో జలమట్టం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రీయ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కాంతారావు, చీఫ్ ఇంజినీర్ బి.శ్యామ్‌ప్రసాద్, ఎస్ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని ఆలయ లైసెన్స్ హక్కుల ఆదాయం రూ. 1.32 కోట్లు

మంగళగిరి టౌన్ : మంగళగిరిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన లైసెన్స్ హక్కుల ఆదాయం 1,32,27,873 రూపాయలు వచ్చిందని కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు. మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వివిధ షాపుల నిర్వహణకు లైసెన్స్ హక్కులకు గురువారం టెండర్లు, బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. వేలం కాల పరిమితి సంవత్సరం వరకు అమలులో ఉంటుందని తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం రూ. 16,93,756 అదనంగా వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడల్లో ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్ : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలలు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025కు ఈనెల 18లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి ఐదు పాఠశాలలను ఎంపిక చేసేందుకు అవకాశం ఉందని, పూర్తి వివరాలను డీఈవో కార్యాలయం నుంచి పొంది, దరఖాస్తు చేయాలని ఆమె సూచించారు.